ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 21 జూలై 2025



జిల్లా క్రీడా శాఖాధికారి నియామకం

పార్వతీపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా శాఖాధికారిగా కె.శ్రీధర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా క్రీడాశాఖాధికారిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. కాగా ఇప్పటి వరకు జిల్లా ఇన్‌చార్జి క్రీడాశాఖాధికారిగా పని చేసిన ఎస్.వెంకటేశ్వర్లు విశాఖకు బదిలీ చేశారు. త్వరలోనే శ్రీధర్ బాధ్యతలు స్వీకరించనున్నారు.



జిల్లా క్రీడా శాఖాధికారి శ్రీధర్

వసతిగృహాలు.. సమస్యల లోగిళ్లు!

- గత వైసీపీ సర్కారు తీరుతో దయనీయ స్థితి
- మౌలిక వసతులకు నోచని వైనం
- ఇరుకు గదులు.. పనిచేయని మరుగుదొడ్లు
- చదువుకున్న చోటే నేలపై పడక..
- తాగునీటి సౌకర్యం అంతంతమాత్రమే..
- వీడని దోమల బెడద
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని విన్నపం

జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని వసతిగృహాలు సమస్యలకు కేరాఫ్‌గా నిలిచాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దయనీయ స్థితికి చేరుకున్నాయి. ఇరుకు గదులు.. అధ్వానంగా మరుగు దొడ్లు.. తలుపులు, రక్షణ గోడలేని భవనాలు.. దోమల బెడద.. తాగునీటి కొరత వంటి సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. ప్రధానంగా చదువు కున్న చోటే పడుకోవాల్సిన దుస్థితి. భోజన శాలలు లేక ఆరుబయటే తినాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. గత వైసీపీ సర్కారు ఎస్టీ, ఎస్సీ, బీసీ వసతిగృహాల అభివృద్ధికి, మరమ్మతు పనులకు కాసులు విదల్చలేదు. దీంతో కొన్నాళ్లుగా ఇబ్బందుల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని జిలావాసులు కోరుతున్నారు.



సీతంపేట ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాలలో నేలపైనే పడుకున్న గిరిబిడ్డలు

జిల్లాకేంద్రంలో..

పార్వతీపురం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం బైపాస్ కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం(2)లో 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవల రూ.30లక్షలతో హాస్టల్‌లో వివిధ పనులు చేపట్టారు. అయితే తాగునీటి సౌకర్యాన్ని మాత్రం కల్పించలేదు. వసతి గృహం చుట్టూ రక్షణ గోడ కూడా నిర్మించలేదు. దీంతో రాత్రి వేళల్లో విషసర్పాల సంచారం వల్ల విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వసతి గృహ నిర్వహణ అధికారి నూకరాజును వివరణ కోరగా విద్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు.

- జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలోనూ సమస్యలు తిష్ట వేశాయి. గత కొన్నేళ్లుగా దీనిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు పాలిటెక్నిక్ చదువుతున్న 58 మంది విద్యార్థులకు వసతి, తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. దీనిపై వసతి గృహ అధికారి హరికను వివరణ కోరగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



కురుపాం బీసీ బాలుర వసతి గృహంలో ఓ గదికి తలుపు ఇలా..

ఆరుబయటకు వెళ్లాల్సిందే..

కురుపాం,జూలై20(ఆంధ్రజ్యోతి): కురుపాం బీసీ బాలుర వసతి గృహం మరుగుదొడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడున్న 59 మంది విద్యార్థులు ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపోతే వసతిగృహంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనిచేయడం లేదు. కొన్ని రూములకు డోర్లు కూడా లేవు. దీనిపై వార్డెన్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. మరుగుదొడ్లు, వసతి గృహం మరమ్మతులకు ప్రభుత్వం రూ. 2 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

- కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు

(మిగతా 8వ పేజీలో...)

తీరని వసతి సమస్య..

జియ్యమ్మవలస, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 81 మంది విద్యార్థులు ఉన్నారు. 3 నుంచి 10 తరగతుల వారికి కేవలం 5 గదులే ఉన్నాయి. దీంతో వారు చదువుకున్న చోటే పడుకోవాల్సి వస్తోంది. ఇరుకు గదులతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

- చినమేరంగి బీసీ పోస్టుమెట్రిక్, ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఒకే దగ్గర నడుస్తున్నాయి. ఇక్కడ తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం లేదు. పెచ్చులూడిన గచ్చులు, పనిచేయని ఫ్యాన్లతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక చినమేరంగి బీసీ బాలికల వసతి గృహం విషయానికొస్తే.. ఇది ఒక అద్దె గృహంలో నడుస్తోంది. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



చినమేరంగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో టాయిలెట్లు ఇలా..

నిమ్మ ధర పైపైకి...

- బస్తా రూ.750 పైమాటే..
- గిరిజన రైతుల్లో ఆనందం

సీతంపేట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజన రైతులు సేకరించే అటవీ ఉత్పత్తుల్లో నిమ్మ పంట ఒకటి. అయితే గడిచిన కొద్ది వారాలుగా నిమ్మకాయలకు ఆశించిన స్థాయిలో మద్దతు ధర రాలేదు. దీంతో గిరిజన రైతులు ఆవేదన చెందారు. ప్రస్తుతం సీన్ మారింది. సీతంపేట వారపు సంతలో ఆదివారం నిమ్మకాయలకు డిమాండ్ పెరిగింది. వాటిని కొనేందుకు మైదాన ప్రాంత వ్యాపారులు పోటీ పడ్డారు. గత వారం 45కేజీల నిమ్మకాయల బస్తా ధర రూ.450లు ఉండగా.. నేడు రూ.750కు చేరింది. ఒక్కసారిగా ధర పెరగడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించిందనే సంతోషంతో ఇంటిదారి పట్టారు.



వ్యానులో నిమ్మకాయల బస్తాలను లోడ్ చేస్తున్న దృశ్యం

కాలువలు అధ్వానం.. సాగునీటికి ఆటంకం



సీతారాంపురం సమీపంలో కాలువ ఇలా..

గరుగుబిల్లి, జూలై20(ఆంధ్రజ్యోతి): జంఝావతి ప్రాజెక్టు నుంచి ఈ నెల 10న ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేశారు. అయితే కాలువలు అధ్వానంగా ఉండడం వల్ల పది రోజుల తర్వాత మండలానికి ఆ నీరు చేరింది. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇలా అయితే సాగు ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలన్నీ అధికంగా పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. దీంతో సాగునీరు సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. అయితే గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు నారుమడులకు కూడా జీవం పోశాయి. ప్రస్తుతం సాగునీరు సరఫరా కావడంతో ఉబాలు ఊపందుకునే అవకాశం ఉంది. అసలు కాలువ పరిధిలో సుమారు 5 వేల ఎకరాలకు పైబడి సాగునీరు అందాల్సి ఉంది. అయితే శివారు ప్రాంతాలైన గొట్టవలస, ఉద్దవోలు, గరుగుబిల్లి, పెద్దూరు గ్రామాలకు నీరు అందుతుందో.. లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాలువల్లో పూడికలు, పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

7లో

జ్వరంతో బాలింత మృతి

- సీతంపేట మండలంలో ఘటన

7లో



వన్నాం గ్రామ సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

వన్నాంలో ఏనుగులు

కొమరాడ, జూలై20(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు నిమ్మలపాడు, బిత్రపాడు గ్రామాల్లో సంచరించిన గజరాజులు ఆదివారం వన్నాం పంచాయతీ పరిధిలో దర్శనమిచ్చాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోయారు. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని భయాందోళన చెందారు. కాగా తొమ్మిది గజరాజులు అరటి, పామాయిల్ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి తక్షణమే వాటిని తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సీతాఫలాలు వచ్చేశాయ్

- ప్రారంభమైన సీజన్
- కేట్ ధర రూ.1000

సీతంపేట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మధురఫలంగా పేరొందిన సీతాఫలాల సీజన్ సీతంపేట ఏజెన్సీలో ప్రారంభమైంది. ఆదివారం సీతంపేట వారపుసంతకు గిరిజన రైతులు పెద్దఎత్తున పంటను తీసుకువచ్చారు. ఒక్కో కేట్ ధర రూ.1000 వరకు పలికింది. సీజన్ ప్రారంభంలో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. వాస్తవంగా ఏటా జూలై నెలాఖరు నుంచి అక్టోబరు వరకు సీతాఫలం పంట సీజన్ నడుస్తుంది. ఈ ప్రాంత గిరిజన రైతులకు ఎంతో లాభం చేకూర్చే పంటల్లో ఇదొకటి. ఏజెన్సీలో పండే సీతాఫలానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.



సీతంపేట వారపు సంతకు గిరిజన రైతులు తీసుకొచ్చిన సీతాఫలాలు

సువర్ణముఖికి స్వల్ప వరద

మక్కువ, జూలై20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం ఒడిశాతోపాటు జిల్లాలో కూడా వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి నదికి స్వల్పంగా వరద పోటెత్తుతోంది. శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు నీటిమట్టం 161 మీటర్లు కాగా ప్రస్తుతం 160.4 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే అధికారులు వంద క్యూసెక్కులను నదిలోకి విడిచిపెట్టారు. ఆదివారం రాత్రికి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా వరద నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాల చుట్టూ ఉన్న రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.



సువర్ణముఖి నదిలో వరద ప్రవాహం

ఎప్పుడిస్తారో?





- కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తుదారుల ఎదురుచూపు
- మార్పులు, చేర్పులకు వేలాది దరఖాస్తులు
- త్వరితగతిన మంజూరు చేయాలని ప్రజల విన్నపం

పార్వతీపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులకే కాదు.. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు ఎంతో కీలకం. అందుకే ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ఎంతోమంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఏడాది మే 7వ తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభమవగా.. వేలాదిగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. నూతన కార్డుల కోసం కొందరు.. మార్పులు, చేర్పులు, తొలగింపు, సరెండర్, స్ప్లిట్ కోసం మరికొందరు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే రోజులు గడుస్తున్నా.. ఇంతవరకూ ఎటువంటి ప్రకటన లేకపోవడంతో దరఖాస్తుదారులు నూతన కార్డుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కార్డుల జారీ ప్రక్రియ జరగలేదు. మార్పులు, చేర్పులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఐదేళ్ల నుంచి ఎంతో మంది దరఖాస్తులు చేసుకుని కొత్త రేషన్ కార్డుల కోసం కోసం నిరీక్షిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అర్హులైన వారు కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించడంతో గ్రామ, సచివాలయాల్లో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికీ ఎంతోమంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే కొత్త రేషన్ కార్డుల జారీపై స్పష్టత కొరవడింది. దీంతో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తారో చెప్పాలని అడుగుతున్నారు.

ఇది పరిస్థితి ...

జిల్లాలో ప్రస్తుతం 2,76,703 రైస్‌కార్డులు ఉన్నాయి. ఇందులో డబ్ల్యూఏపీ కార్డులు 2,22,394 , అంత్యోదయ కార్డులు 54,309 వరకూ ఉన్నాయి. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటివరకు అధికారులకు 2,284 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా భామిని మండలం నుంచి 157 దరఖాస్తులు అందాయి. బలిజిపేట వంద, గరుగుబిల్లి 138, గుమ్మలక్ష్మీపురం 140, జియ్యమ్మవలస 125, కొమరాడ 152, కురుపాం 142, మక్కువ 134, పాచిపెంట 145 చొప్పున దరఖాస్తులు చేరాయి. పాలకొండ మండలం 125, పాలకొండ అర్బన్ 66, పార్వతీపురం అర్బన్ 96, పార్వతీపురం రూరల్ 141,

(మిగతా 8వ పేజీలో...)

రోడ్డు పనులు పూర్తికాక.. బస్సులు నడవక

8లో

బిక్కుబిక్కుమంటూ విధులు

8లో

ఇలాగే వండి పెడతారా?

- వార్డెన్, వంట నిర్వాహకులపై ఎమ్మెల్యే విజయచంద్ర ఆగ్రహం



8లో

నేడు కొత్తవలసకు వ్యవసాయ శాఖా మంత్రి రాక

శృంగవరపుకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు సోమవారం సాయంత్రం 3.30 గంటలకు కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామానికి రానున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన వెలువడింది.

అశోక్‌ను కలిసిన శాప్ చైర్మన్

విజయనగరం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును శాప్ చైర్మన్ రవినాయుడు ఆదివారం విజయనగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరక్టర్ బీవీఎస్ఎన్ రాజు, తెలుగు యువత నాయకులు పొగిరి పైడిరాజు, వేమలి చైతన్యబాబు, జి.సురేంద్ర, ఎం.ప్రవీణ్, రాజునాయుడు, మాతా బుజ్జి, సంతోష్ వర్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె తన భర్త, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రామప్రసాద్‌తో కలిసి ఆదివారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని స్పీకర్ నివాసానికి వెళ్లారు. ఈనెల 30న జరగనున్న తన కుమారుడు భూపాల్‌నాయుడు వివాహానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. టీడీపీ నాయకులు మాకిన నవీన్ పాత్రుడు, గోగాడ జగన్నాథంనాయుడు ఉన్నారు.

డీలర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఉమాశంకరరావు

శృంగవరపుకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కోటకు చెందిన కొణదం ఉమాశంకరరావును ఎంపిక చేశారు. ఆదివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల విభాగంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎస్.కోట శివారు సీతంపేటకు చెందిన చిప్పాడ రమణను ఎంపిక చేశారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షుడు లీలా మాధవరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి 70 బస్తాల సిమెంట్ వితరణ

చీపురుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం గరికివలసలో రామాలయ నిర్మాణం కోసం టీడీపీ చీపురుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ 70 సిమెంట్ బస్తాలను వితరణగా అందజేశారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసం వద్ద వీటిని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు బెల్లాన నారాయణ, బెల్లాన సత్యంకు అందజేశారు.

రహదారి నిబంధనలు పాటించాలి

సంతకవిటి, జూలై 20(ఆంధ్రజ్యోతి): తారు రోడ్డుపై ఇనుప చక్రాలతో ట్రాక్టర్‌ను నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన ట్రాక్టర్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతుండడంతో ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు బిగించి, తారురోడ్డుపై ప్రయాణిస్తున్నారని, దీనివల్ల రహదారులు పాడవుతున్నాయని, ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డ్రైవర్లందరూ దీనికి సహకరించాలని ఆయన కోరారు.

రైతు బజారు స్థలం ప్రభుత్వానిదే..

విజయనగరం దాసన్నపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ రోడ్డు సమీపంలోని రైతుబజారు ప్రభుత్వ స్థలమేనని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. ప్రభుత్వ స్థలం విషయమై తగిన ఆధారాలతో ఉన్న కాపీని ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1922 నుంచి 1995 వరకూ మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగిందని, 1995లో ఆసుపత్రికి వేరేచోటికి తరలించారని చెప్పారు. 2018లో టీడీపీ ప్రభుత్వమే సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జీవో ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా రైతు బజారును కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యా ప్రమాణాలను పెంచేందుకు క్విజ్ పోటీలు

గంట్యాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ అన్నపూర్ణ తెలిపారు. గంట్యాడ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రతినెల ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వార్డెన్ గొర్లె గోవిందరావు తదితరులు ఉన్నారు.

కేఎంవలసలో తాగునీటికి కటకట

రేగిడి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుళ్లపాడు పంచాయతీ కేఎంవలస గ్రామంలో గత వారం రోజులుగా రక్షితనీటి సరఫరా నిలిపోయింది. మోటార్ పాడవ్వటంతో రక్షిత తాగునీటి సరఫరా పూర్తిగా ఆగిపోయినట్టు గ్రామస్థులు తెలిపారు. తక్షణమే తమ గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

● దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చరణ్‌ను వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి వచ్చిందని, వేరే లైన్ ద్వారా తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఉన్నవీ పోయే.. కొత్తవీ పూర్తి కాకపోయే..

● అర్ధాంతరంగా పీహెచ్‌సీ భవన నిర్మాణాలు
● పాత వాటిని పడగొట్టిన వైనం
● వేరే భవనాల్లో విధులు..

ఇబ్బంది పడుతున్న సిబ్బంది



నగంలో నిలిచిపోయిన వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీ భవన నిర్మాణాలు

కొత్తవలస, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉన్న భవనాలను పడగొట్టారు.. నూతన భవనాలను పూర్తి చేయలేదు.. ఇదీ మండలంలోని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల పరిస్థితి. మండలంలోని కొత్తవలస, వియ్యంపేట గ్రామాలలో 24 గంటలూ పని చేసే రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ రెండు పీహెచ్‌సీలకు సొంతంగా పక్కా భవనాలు ఉండేవి. ఈ రెండు పీహెచ్‌సీలకు సంబంధించిన భవనాలు మరీ అంత పాడవ్వలేదు. అయినా గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా రెండు పీహెచ్‌సీలకు నూతన భవనాలను నిర్మాణం చేస్తామని ముందుగా వియ్యంపేటలోనున్న పీహెచ్‌సీ భవనాన్ని తొలగించింది. వియ్యంపేట పీహెచ్‌సీకి నూతన భవనాలు ఏర్పాటు చేయడానికి చాలా స్థలం ఉంది. కానీ పాత భవనం స్థానంలోనే కొత్త భవనం నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో ఉన్న భవనాన్ని తొలగించారు. పీహెచ్‌సీని ఎదురుగా ఉన్న మూతపడిన హాస్టల్ భవనంలోకి మార్పు చేశారు. తర్వాత హడావుడిగా నూతన భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేశారు. పునాదులు దాటిన తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదని కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆ భవన నిర్మాణం సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాలేదు. ప్రస్తుతం ఈ భవనం ఉన్న ప్రాంతాన్ని చూస్తే అడవి మాదిరిగా మారింది.

ఎన్జీవో భవనంలో విధులు

ఇక కొత్తవలస పీహెచ్‌సీ భవనం పరిస్థితి మరో రకంగా ఉంది. ఇక్కడ పాత భవనం తొలగిస్తేనే కొత్త భవనం నిర్మాణం చేయడానికి వీలవుతుంది. దీంతో ఉన్న భవనాన్ని కొత్తవలస తాలూకా ఎన్జీవో హోంలోకి మార్పు చేశారు. ఈ ఎన్జీవో హోంలో ఒక్కటే హాలు ఉండడంతో అందరూ కలసి ఒకేదగ్గర విధులు నిర్వహించాల్సి వస్తోంది. వైద్యాధికారులకు మాత్రమే చిన్న చిన్న రూములను ఏర్పాటు చేశారు. దీంతో సిబ్బంది అంతా ఒకే దగ్గర పని చేయడంతో మందులు స్టాక్‌ను కూడా హాలులోనే ఉంచడం వల్ల సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. తమ ఎన్జీవో సంఘం కోసం ఏర్పాటు చేసుకున్న భవనంలో ఎన్నాళ్లు పీహెచ్‌సీని నిర్వహిస్తారంటూ సంఘం ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తి చేస్తాం

ఈ రెండు పీహెచ్‌సీల భవనాలను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గత కొద్ది రోజులు కిందట పరిశీలించి వెళ్లారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. నెలలు గడుస్తున్నా నిధులు మంజూరు కాలేదు.. పనులు మొదలు కాలేదు. ఇప్పటికైనా ఈ రెండు పీహెచ్‌సీ భవన నిర్మాణాలను పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం: ప్రచారంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన తుమ్మికాపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి, ఏడాది పాలనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో రూ.360కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పథకాల అమలులో ఏమైనా లోపాలు ఉంటే తెలియజేయాలని వాటిని సరిదిద్దుకుని మరింత సమర్థవంతంగా పని చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. అలాగే మండలానికి ఒక అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గోవింద, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టాంలో సుపరిపాలనలో తొలి అడుగు

శృంగవరపుకోట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొట్టాం గ్రామంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టూరిజం కార్పొరేషన్ బోర్డు డైరక్టర్ ఇందుకూరి సుధారాణి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని లెక్కచేయకుండా గ్రామంలో పర్యటించి, సంక్షేమ పథకాలపై వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.



ఎస్.కోట రూరల్: కొట్టాంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

సామాజిక అవసరం కోసమే సాహిత్యం



మాట్లాడుతున్న కాశీం

రాజాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక అవసరం కోసమే సాహిత్యం అని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 126వ సమావేశాన్ని కో కన్వీనర్ పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన చేతులమీదగా కున్నెమ్మ-మరికొన్ని అనే కథల సంపుటి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరి నాయుడు తదితర కవులు పాల్గొన్నారు.

రాజాం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వెంకటరావు

రాజాం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి విలేకరి పెంకి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభ్యులంతా వెంకటరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీపుల్స్ విజన్ శర్మ, గౌరవ సలహాదారులుగా యూవీయా చంద్రశేఖర్, సతీష్, ఉపాధ్యక్షులుగా వావిలపల్లి శ్రీనివాసరావు, గుడిబండ సూర్యనారాయణ, కార్యదర్శిగా కరణం సురేష్ కుమార్, సహాయ కార్యదర్శులుగా వడ్డాది రాజేష్, తేగల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పొగిరి వెంకటరావు, ట్రెజరర్‌గా పాలపర్తి గణేష్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పాపారావు

రాజాం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, రొటేరియన్ గట్టి పాపారావు రాజాం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి రాజాంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పాపారావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బీవీ అచ్యుత్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.వసంతరావు, సంయుక్త కార్యదర్శిగా న్యాయవాది జయదేవ్, ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొత్తా మదుసూధనరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఇనస్టలేషన్ ఆఫీసర్, రొటేరియన్ కిశోర్‌కుమార్, రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న విజయనగరం ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

విజయనగరం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 30న మార్కెట్ కమిటీ ఆవరణలో జరగనుంది. ఈ మేరకు చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకవర్గ సభ్యులంతా ఆదివారం అశోక్ బంగ్లాలో సమావేశమై చర్చించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని ఆయన నివాసంలో, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని పార్టీ కార్యాలయంలో కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఏఎంసీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న సమావేశంలో చైర్మన్‌గా కర్రోతు నర్సింగ రావు, వైస్ చైర్మన్‌గా బొబ్బాది చంద్రినాయుడుతో పాటు, పాలకవర్గ సభ్యులుగా రామోలు అప్పలనాయుడు, వర్రి సంతోషి, సుంకరి సన్యాసప్పడు, చింతపల్లి రమణ, వేలిచేటి మణికుమారి, షేక్ హుస్సేన్, మద్దాల దేవీశ్రీ, నారంశెట్టి రమణమ్మ, చెన్నా రూపావాణి, లక్కిడాపు గౌరీ, ఉప్పాడ వెంకట అప్పారావు, సాగి సాయిరామ్‌లతో పాటు గాజుల రేగ పీఏసీఎస్ అధ్యక్షులు, మార్కెటింగ్ శాఖ ఏడీ, వ్యవసాయశాఖ ఏడీ, నగరపాలక సంస్థ మేయర్‌లు మెంబర్లుగా ప్రమాణం చేయనున్నారు.

నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి

● విజయనగరం ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో విజయనగరం పార్లమెంటు పరిధిలో ఎంతో అభివృద్ధి జరిగిందని, రానున్న నాలుగేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చెందనుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం పార్లమెంటు పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే విజయనగరం, బొబ్బిలితో పాటు పలు నియోజకవర్గాల్లో స్థల పరిశీలన పూర్తవుతున్నదన్నారు. ఒక్కొక్క డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కు రూ.2 కోట్లు వ్యయం అవుతున్నదని, ఈ వ్యయంలో ఇప్పటికే కోటి రూపాయల నిధులను ఎంపీ కోటాలో కేటాయించామని, మిగతా నిధులను దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇక విజయనగరం పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో స్పోర్ట్సు కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామ న్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు రోడ్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. విజయనగరం నుంచి పాలకొండ, రామభద్రపురం నుంచి బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడ, రామభద్రపురం బొబ్బిలి మీదుగా రాజాం, అదే విధంగా నెల్లిమర్ల, రామతీర్థం మీదుగా జాతీయ రహదారి కలుపుతూ రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్టు చెప్పారు. వీటితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, కర్రోతు నర్సింగరావు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బెవర భరత్, హుస్సేన్ పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ



వరద నీటిని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

శృంగవరపుకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డు సమస్య పరిష్కారానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతిని ధి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ చొరవ చూపారు. ఆదివారం సాయం త్రం ఈ రోడ్డులో నిలిచిపోయిన వరద నీటిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఇందుకూరి శ్రీనురాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షు డు సీహెచ్‌ఆర్‌కె ప్రసాద్‌లతో కలసి ఆయన పరిశీలించారు. ఈ వరద నీరు బయటకు పోకపోవడానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, సమస్యను వివరించారు. సోమవారం ఉదయం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలకు వస్తున్నట్లు కలెక్టర్ చెప్పారని కృష్ణ వెల్లడించారు.

నెల రోజులుగా రోడ్డుపైనే మురుగు

● అవస్థలు పడుతున్న వాహనచోదకులు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

రాజాం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజాం-శ్రీకాకుళం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో గత నెల రోజులుగా మురుగునీరు నిలిచిపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో సుమారు పది వీధుల్లోని మురుగునీరంతా రాజాం మెయిన్ రోడ్ మీదుగా ప్రవహిస్తుంది. ఇక్కడి కాలువలు వర్షపునీటితో నిండి రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే వాహనాలను నిలిపివేయాల్సిన పరిస్థితి. గత నెలరోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మురుగుతో నిండిన కాలువ

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

● పెచ్చులూడుతున్న శ్లాబు ● భయాందోళనలో చిన్నారులు, తల్లిదండ్రులు



శిథిలస్థితికి చేరిన అంగన్‌వాడీ భవనం

సంతకవిటి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపేట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో దశాబ్దం కిందట పాఠశాల నిర్వహించేవారు. విద్యార్థులు లేని కారణంగా పాఠశాల మూతపడటంతో అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. మోదుగులపేట, చినముకుందపురం గ్రామాలకు ఇదే అంగన్‌వాడీ కేంద్రం. అయితే ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు నుంచి పెచ్చులు ఊడి పడుతు న్నాయి. దీంతో పిల్లలు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఈ భవనానికి కిటికీలు లేవు. ఈ ప్రాంతంలో పాములు తిరుగుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళ న చెందుతున్నారు. నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న శ్లాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పూసపాటిరేగ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోల దామోదరరావు(27) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దామోదరరావు మరొక ఇద్దరు వారి స్వగ్రామమైన డెంకాడ మండలం దొడ్డిబాడువ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. స్థానిక టీవీఎస్ షోరూం సమీపంలోకి వచ్చేసరికి డివైడర్‌కు బలంగా ఢీకొన్నారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న దామోదరావు కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

జ్వరంతో బాలింత..

సీతంపేట రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిమానుగూడ గ్రామానికి చెందిన బాలింత ఆరిక ప్రియాంక(21) జ్వరంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 17న తన స్వగ్రామం మొగదారగూడ గ్రామానికి బిడ్డతో పాటు ప్రియాంక వచ్చింది. అదే రోజున ఆమెకు జ్వరం రావడంతో తండ్రి బిడ్డిక రాజన్న వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి నెల బాబు ఉన్నాడు. ప్రియాంక మృతితో భర్త ఆరిక సుందర్రావు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

బైకును ఢీకొన్న బస్సు

● ఇద్దరికి గాయాలు

జియ్యమ్మవలస, జూలై20 (ఆంధ్రజ్యోతి): బైకును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాల పాలయ్యారు. పెదమేరంగి రామాలయం సమీపంలో ఆదివారం జరిగిన ఈ ఘటనపై చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినమేరంగి గ్రామానికి చెందిన సిద్ధాంతం నాగరాజు, సిద్ధాంతం వెంకటేష్ పెదమేరంగి కూడలి నుంచి చినమేరంగి వైపు బైక్‌పై వెళుతున్నారు. పార్వతీపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పెదమేరంగి రామాలయం సమీపంలో వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం చినమేరంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యానికి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

దత్తిరాజేరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మర్రివలస జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్టేషన్ బూర్జవలస పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖకు చెందిన బోగి అనీల్‌కుమార్ విశాఖ నుంచి తన అత్తవారు ఇంటికి రామభద్రపురం మండలం మిర్తివలసకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మర్రివలస జంక్షన్ వద్దకు వచ్చేసరికి రామభద్రపురం నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అనీల్‌కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో పోలీస్ గార్డు మృతి

కొమరాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొమరాడ పోలీస్‌స్టేషన్‌లో గార్డుగా విధులు నిర్వహిస్తున్న జె.గణప్రసాద్ శనివారం రాత్రి గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఈ విషయాన్ని గమనించిన తోటి పోలీసులు 108 వాహనంలో పార్వతీపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన గణప్రసాద్ శనివారం రాత్రి ఎప్పటిలాగే డ్యూటీ సమయానికి విధులకు హాజరయ్యారు. గుండె నొప్పితో కుప్ప కూలి మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గణప్రసాద్ మృతిపై ఎస్ఐ కె.నీలకంఠ, సిబ్బంది సంతాపం తెలిపారు.

రామన్నపాలెంలో పోలీసు పహారా



పహారా కాస్తున్న పోలీసులు

శృంగవరపుకోట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం పంచాయతీ రామన్నపాలెంలో ఆదివారం ఉదయం పెద్దఎత్తున పోలీసులు చేరుకుని పహారా కాశారు. తమ గ్రామంలో ఎటువంటి ఘటనలు జరగక పోయినా ఇంతమంది పోలీసులు ఎందుకు వచ్చారో అని గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ప్రాంతానికి ఎమ్మెల్సీ వెళ్తున్నా రన్న ప్రచారంతో పోలీసులు పెద్దఎత్తున ఇక్కడకు చేరుకుని ఉండొచ్చని పలువురు చెబుతున్నారు.

జిందాల్ నిర్వాసితుల కష్టాలు ఎవరికీ పట్టవా?

● ఎమ్మెల్సీ రఘురాజు



విచారణ చేయాలని రాసిన లేఖను చూపిస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజ మాన్యం తమకు న్యాయం చేయాలని గత 28 రోజులుగా వందలమంది హరిజన, గిరిజనులు శాంతియుత పోరాటం చేస్తుంటే ఏ ఒక్క అధికారికి, ప్రజాప్రతినిధికి అడిగే సమయం లేదా.. అంటూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. ఆదివారం ఎస్.కోటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి కలెక్టర్ నుంచి నేటి మంత్రులు వరకు జిల్లా కేంద్రంలో కూర్చుని జిందాల్ యాజమాన్యం అందిస్తున్న పత్రికా ప్రకటనలు వెలువరించడం తప్ప వారికి వాస్తవం తెలియడం లేదన్నారు. జిల్లా కేంద్రం నుంచి ప్రకటనలు విడుదల చేసే అధికారులు ఎస్.కోట మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి, ఇక్కడ జిందాల్ నిర్వాసితులతో మాట్లాడితే సమస్యలు తెలుస్తాయన్నారు. జిందాల్ భూసేకరణపై హైకోర్టు సింగిల్ జడ్జి, రిటైర్డ్ న్యాయమూర్తి, సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో గత నెలరోజులుగా జిందాల్ యాజమాన్యం కోసం పోలీసులు ఎందుకు అంతగా బందోబస్తు నిర్వహిస్తున్నారని, గ్రామాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్లి ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఈ పోలీస్ పహారాకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఏమైనా ఉన్నాయా ఉంటే వాటిని ఇక్కడ ప్రాంత వాసులకు వివరించాలని కోరారు.

2, 3 తేదీల్లో ఐఎఫ్‌టీయూ రాజకీయ శిక్షణ తరగతులు

నెల్లిమర్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల అమరవీరుల స్మారక భవన్‌లో ఆగస్టు 2, 3 తేదీల్లో ఐఎఫ్‌టీయూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఐఎఫ్‌టీయూ విజయనగరం జిల్లా శాఖ తరఫున నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. రెండు రోజులపాటు మూడు అంశాలపై రాజకీయ తరగతులు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి, నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడు నామాల తిరుపతిరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ప్రతినిధి దూసి ఈశ్వరరావు, చింతల లక్ష్మి, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.పార్వతి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు వి.మల్లేష్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి వినూత్న వీడ్కోలు

చీపురుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి చిననడిపల్లి పంచాయతీలో అక్కడి సర్పంచ్ వినూత్నంగా వీడ్కోలు పలికారు. పెదనడిపల్లి సచివాలయంలో పని చేస్తున్న ఆరుగురు సిబ్బంది ఇటీవల వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆదివారం ఆ గ్రామంలో సర్పంచ్ గడే సత్యవతి తన సొంత నిధులతో వారందరికీ విందు భోజనం ఏర్పాటు చేసి, నూతన దుస్తులు అందజేసి, శాలువలతో సత్కరించారు. వారి స్థానంలో బదిలీపై వచ్చిన మరో ఆరుగురు ఉద్యోగులకు కూడా అదే తరహాలో విందు ఏర్పాటు చేసి, నూతన దుస్తులు అందజేశారు. గ్రామస్థుల సమక్షంలో సన్మానించారు.

వసతి గృహాలు.. సమస్యల లోగిళ్లు!

(5వ పేజీ తరువాయి)

ప్రహరీ లేవు. దీంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. గతంలో నిధులు మంజూరైనా వివిధ కారణాలతో ప్రహరీ పనులు చేపట్టలేదు.

నేలపైనే నిద్ర

సాలూరు/సాలూరు రూరల్/పాచిపెంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో డార్మెటరీ లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. బంగారమ్మ పేటలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతి గృహంలో ఎనిమిది గదులుండగా.. అందులో రెండు వినియోగంలో లేవు. ఈ హాస్టల్‌లో మరుగుదొడ్లకు తలుపులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో విద్యార్థులకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. 2019 డైనింగ్ హాల్ నిర్మాణం కొనసాగుతూనే ఉంది. బంగారమ్మ కాలనీలో గిరిజన బాలికల వసతి గృహంలో మేట్రిన్, వాచ్‌మన్ మినహా ఉద్యోగులెవరూ లేరు. దీంతో కుక్, కమాటీలను ప్రైవేట్‌గా నియమించుకున్నారు.



సాలూరు పట్టణం బంగారమ్మపేటలో గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో డైనింగ్ హాల్ ఇలా..

● సాలూరు మండలం మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు చదువుకున్న చోటే పడుకోవాల్సి వస్తోంది. నూతన భవన నిర్మాణానికి అప్పట్లో రూ. 4 కోట్లు మంజూరయ్యాయి. అయితే పునాదులు స్థాయి వరకు వచ్చి నిర్మాణం నిలిచిపోయింది. దీంతో విద్యార్థినులకు వసతి సమస్య వేధిస్తోంది. కొత్తవలసలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఇప్పటికి విద్యార్థునులు భోజనం ఆరుబయటే చేయాల్సి వస్తుంది. అంటివలస, తోణాం, మావుడి తదితర ఆశ్రమ పాఠశాలల్లో కిచెన్, డైనింగ్ హాల్‌ల సమస్యలున్నాయి.

● పాచిపెంట కేజీబీవీలో ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 265 మంది విద్యార్థినులు ఉన్నారు. అయితే కేవలం 20 బాత్‌రూంలు, 10 మరుగుదొడ్లు ఉండడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. పద్మాపురం గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్ లేవు.

పాలకొండలో..

పాలకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): పాలకొండ బీసీ పోస్టుమెట్రిక్ బాలుర వసతిగృహంలో 80 మంది విద్యార్థులుండగా.. వారికి సరిపడా మరుగుదొడ్లు లేవు. ఉన్న మరుగుదొడ్లకు తలుపులు, రన్నింగ్ వాటర్ లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇక గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉన్న 260 మంది విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోంది. పట్టణంలోని ఎస్సీ పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహంలో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థిను లకు అవస్థలు తప్పడం లేదు. కొన్నిచోట్ల నేలపైనే పడుకోవాల్సి వస్తోంది.



పాలకొండ బీసీ పోస్టుమెట్రిక్ వసతిగృహంలో మరుగుదొడ్లకు డోర్లు లేని దృశ్యం

సీతంపేటలో...

సీతంపేటలో ఉన్న 21 గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడా భోజనశాలలు, టేబుల్స్ లేవు. దీంతో వారు నేలపైనే తినాల్సి వస్తోంది. విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పట్టించుకొనేవారు లేరు. ఈ సీజన్‌లో చాలామంది జ్వరాల బారిన పడి సిక్ రూమ్‌లకు పరిమితమవుతున్నారు. ఐదేళ్ల గడిచినా.. ఇంకా గిరిజన పాఠశాలలకు దోమతెరలు పంపిణీ జరగలేదు. దీంతో విద్యార్థులు దోమ కాట్లకు గురై విషజ్వరాల బారిన పడు తున్నారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరిపడా బెడ్లు లేవు. దీంతో వారు నేలపై నిద్రించాల్సి వస్తుంది. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. పాఠశాలల పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండాయి.

ఎప్పుడిస్తారో?

(5వ పేజీ తరువాయి)

సాలూరు రూరల్ 150, సాలూరు అర్బన్ 129, సీతంపేట రూరల్ 19, సీతానగరం 112, వీరఘట్టం 109 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

మరికొన్ని ఇలా..

చిరునామా మార్పు కోసం 403 దరఖాస్తులు, రైస్‌కార్డులో మార్పుల కోసం 249, ఆధార్‌లో ఉన్న తప్పులు సరిదిద్దేందుకు 326 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా కుటుంబ సభ్యుల యాడింగ్ కోసం 25,824, రైస్‌కార్డు నుంచి పేర్లను తొలగింపునకు 651, స్ప్లిట్ కోసం 3,859, కార్డులు సరెండర్ కోసం తొమ్మిది దరఖాస్తులు వచ్చాయి. ఈ విధంగా కొత్త రేషన్‌కార్డులతో కలుపుకుని మొత్తంగా 33,613 దరఖాస్తులు వచ్చాయి. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట ప్రభుత్వం కొత్త ఆప్షన్ తీసుకొచ్చింది. కార్డుల్లో పేర్లు తొలగింపు, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లిపోయే వారి పేర్లు డిలీట్ చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తులు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు మృతి చెందిన వారిపేర్లు మాత్రమే తొలగిస్తున్నారు. అయితే మిగిలిన దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆదేశాలు రాగానే మంజూరు చేస్తాం

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.

- శ్రీనివాసరావు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, పార్వతీపురం

అశోక్ గజపతిరాజును కలిసిన నాయకులు



సత్కరిస్తున్న నాయకుడు

బాడంగి, జూలై20 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజును ఆదివారం టీడీపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ వాణిజ్య విభాగం స్టేట్ సెక్రటరీ, ఆర్యవైశ్య వీఏఎం స్టేట్ సెక్రటరీ అడ్డా గోవిందరాజు, విజయనగరం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ చెరుకూరి నాగరాజు, జిల్లా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ డిమ్స్ రాజు, జిల్లా యువజన సంఘం ప్రెసిడెంట్ ఆరిశెట్టి సందీప్, జిల్లా యువజన సంఘం ట్రెజరర్ సూరంపల్లి రాకేష్ తదితరులు ఆయనను కలిసి సత్కరించారు.

మహాసభలను విజయవంతం చేయండి

బొబ్బిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 19న విజయనగరంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1936 లో ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి అన్న నినాదంతో ఐద్వా ఏర్పాటైందన్నారు. నాటి నుంచి అసమానతలు లేని సమాజం కోసం, మత సామరస్యం కోసం, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు తదితర సామాజిక రుగ్మతలపై పోరాటాలు సాగిస్తోందని వివరించారు.

బిక్కుబిక్కుమంటూ విధులు

- ●శిథిలావస్థలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ●అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణం
- ●రోగులకూ తప్పని ఇక్కట్లు

సీతానగరం, జూలై20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఇటు రోగులు, అటు వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో అందులో బిక్కుబిక్కు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షానికి భవనం కారుతుండటంతో పీహెచ్‌సీలో మందులు, ఇతర పరికరాలు పాడయ్యే ప్రమాదం ఉంది. సీహెచ్‌సీ ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఇక్కడకు రోజూ 80 నుంచి 100 మంది రోగులు వస్తుంటారు. ప్రస్తుతం కోవిడ్ భవనంలో సేవలు అందిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.1.66 కోట్లతో భవన నిర్మానం ప్రారంభమైంది. పనులను సంబంధిత కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల ఆరోగ్యశాఖ మంత్రి స్థానిక పీహెచ్‌సీని, అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించినప్పటికీ పనులు ఎక్కడి గొంగళి అక్కడే నిలిచి ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.



అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణం



పెచ్చులూడిన పైకప్పు



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే..

కొత్త కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తాం..

పాత కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో అసంపూర్తిగా నిలిచిన పనులను కొత్త కాంట్రాక్టర్‌తో చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

-విజయ్‌కుమార్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

ఇలాగే వండి పెడతారా?

●వార్డెన్, వంట నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, జూలై20 (ఆంధ్రజ్యోతి): జోగింపేటలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వంటల తీరుపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మండిపడ్డారు. నిత్యం ఇలాగే విద్యార్థులకు వండి పెడుతున్నారా అని వార్డెన్, వంట నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం ఆయన పాఠశాలను సందర్శించారు. అంతకు ముందు విద్యార్థులకు వాలీబాల్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. విద్యార్థులతో కాసేపు వాలీబాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం పాఠశాలను సందర్శించారు. గురుకులంలో పరుపులు పాడైన విషయాన్ని విద్యార్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. దాంతో ఆయన స్పందించారు. త్వరలోనే పరుపులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పనకు పాటుపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వేతనాలు పెంచండి

పార్వతీపురం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ కోరారు. ఆదివారం ఉదయం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్లు మాదిరిగా తాము కూడా ప్రభుత్వ సేవల్లో పాల్గొంటున్నామన్నారు. అయినప్పటికీ చాలీచాలని వేతనాలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

కూటమితోనే సుపరిపాలన



మండలో ప్రచారం చేస్తున్న మాలయ్య

సీతంపేట రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర గిరిజన సలహామండలి సభ్యులు సవర మాలయ్య అన్నారు. ఆదివారం ఆయన మండ గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సవరతోట ముఖలింగం, నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, సూర్యం, రజనీ పాల్గొన్నారు.

●పాలకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణ, పాలకండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి ఆధ్వర్యంలో పట్టణంలోని 17, 18, 19 వార్డుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి హయాంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెడుతోందన్నారు. ఏడాది కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, వంజరాపు ఈశ్వరరావు, గుమ్మడి సింహాద్రి, శాసపు సర్వారావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ తాడికొండలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, నాయకులు త్రినాథ్, వేణు, జయంత్, శ్రీహరి, శివ, చంటి తదితరులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చెట్లే జీవనాధారం

ఒడిశా



మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయగడ, జూలై20 (ఆంధ్రజ్యోతి): చెట్లు జీవనాధారమని, చెట్లు లేకపోతే మానవ జీవితం అంధకారమవుతుందని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్లు అన్నారు. స్థానిక సీఆర్‌పీఎఫ్ 4వ బెటాలియన్ కార్యాలయంలో ఆదివారం లయన్స్ క్లబ్ అపరాజిత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కమాండెంట్లు ఫిరాజ్ కుజుర్, సెకెండ్ కమాండెంట్లు, ప్రభాకర్ ఉపాధ్యాయ, సంజయ్‌కుమార్ రౌత్, డిప్యూటీ కమాండెంట్ ముఖేష్‌సింగ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ పటేల్ పాల్గొని 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం క్లబ్ క్విస్ట్ ఛైర్‌పర్సన్ టి.జయరాం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాక్షురాలు కె.రజిత, కార్యదర్శి బి.అవంతి, కోశాధికారి పి.కల్యాణి, జవాన్లు పాల్గొన్నారు. మొక్కలను ప్లాంటేషన్ ఛైర్‌పర్సన్ కె.భాగీరథ అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్లను అపరాజిత సత్కరించారు.

సమస్యలను పరిష్కరిస్తా..



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం మండలంలోని గిజబలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలను నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజ రుణం తీర్చుకుంటానన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు ఎం.రాంబాబు, కె.సుమన్, ఎంబీ విజయవాంకుశం, జి.లక్ష్మనాయుడు తదతరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సాలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని టీడీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరాసువలసలోని కేజీబీవీలో ఇటీవల నియమించిన కుక్‌ల నియామకాల్లో టీడీపీ నాయకులు డబ్బులు వసూలు చేశారని తప్పుడు రాతలు విమర్శలు చేసిన వైసీపీ నాయకులు నిజాలు నిరూపించాలన్నారు. లేకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది సరిగా పని చేయడంలేదని, కుక్‌లు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని తమకు విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు ఫిర్యాదు చేశారన్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు పలుమార్లు అక్కడకు వెళ్లి పరిస్థితులు గమనించామన్నారు. వారిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. చివరకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి దృష్టికి తమతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారన్నారు. దాంతో రాష్ట్ర మంత్రి ఏప్రిల్ 9న కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేశారన్నారు. అక్కడ అక్రమాలు జరుగుతున్నట్టు మంత్రి గుర్తించి సంబంధిత ఉన్నతాధికారులకు విచారణకు ఆదేశించారన్నారు. ఉన్నతాధికారులు స్పెషల్ ఆఫీసర్‌తో పాటు కుక్‌లపై చర్యలు తీసుకున్నారన్నారు. 4 కుక్ పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. ఆ స్థానంలో నలుగురిని భర్తీ చేశామన్నారు. రోజుకు రూ. 250 వేతనం లభించే ఇలాంటి పోస్టులకు లక్షల్లో డబ్బులు వసూలు చేశారని పత్రికల్లో రాయించడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు అప్పికొండ రమాదేవి, వైస్ సర్పంచ్ యుగంధర్, 19వ వార్డు కౌన్సిలర్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రహదారికి మోక్షం



కోటవానివలస ప్రాంతంలో బీటీ రహదారి పనులు

గరుగుబిల్లి, జూలై20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పార్వతీపురం నుంచి అడ్డాపువీల వరకు ఉన్న రహదారి మెరుగుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రూ. 40 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం బీటీ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్లకు పైగా ప్రధాన రహదారి మార్గంలో ప్రయాణం చేయాలంటే భయపడేవారు. ప్రస్తుతం బీటీ పనులు చురుగ్గా జరుగుతుండటంతో వారికి రహదారి కష్టాలు తీరనున్నాయి.

రేషన్ డీలర్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చొక్కాపు

రామభద్రపురం, జూలై20 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామభద్రపురానికి చెందిన డీలర్ చొక్కాపు రామారావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీలర్ల ఉపాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఇదిలా ఉండగా రామారావు ఎన్నికపై పలువురు రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేటీకరణ చేయవద్దు

రామభద్రపురం, జూలై20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఉద్యోగులకు, కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని సీఐటీయూ కార్యదర్శి కె.సురేష్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి బలసా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు.

రోడ్డు పనులు పూర్తికాక.. బస్సులు నడవక



ములక్యాయవలసలో పూర్తికాని రోడ్డు

●ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

మక్కువ రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అతి ప్రధానమైన మక్కువ-చినబోగిలి రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాంతో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. పర్యవసానంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు పనులకు 2018లోనే రూ.36 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో కొంత వరకు పనులు జరిగాయి. అయితే చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరేళ్లగా ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఏడాది కిందటే తారు రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే రహదారి మధ్యలో తామరఖండి, భగ్గందొరవలస, వెంకటభైరిపురం, పాపయ్యవలస, ములక్యాయవలస ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాల్స ఉంది. ఈ పనుల్లో జాప్యం వల్ల ఆర్టీసీ బస్సులు తిరగడంలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే వారు ఆపసోపాలు పడుతున్నారు. ఇకనైనా రోడ్డు పనుల పూర్తికి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

రోడ్డు పనులు పూర్తిచేయిస్తాం..

మక్కువ- చినబోగిలి రహదారి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. వర్షాల కారణంగా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. బస్సుల రాకపోకలకు అనువుగా రోడ్డు పనులు పూర్తిచేయిస్తాం.

-విజయ్‌కుమార్, జేఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

హడావుడి బదిలీలతో సమస్య

పార్వతీపురం, జూలై20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు ముందు విద్యాశాఖాధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకుని ఉంటే బాగుండేదని పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటినాయుడు, కాగాన విజయకుమార్ అన్నారు. ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఉపాధ్యాయ పోస్టులను కొన్ని పాఠశాలలకు మంజూరు చేయకుండా బదిలీలు చేయడం వల్లనే జీతాల సమస్య వచ్చిందన్నారు. ఇప్పటికే కూడా విద్యాశాఖ అధికారులు ఎప్పటిలోగా పొజిషన్ ఐడీలు ఉపాధ్యాయులకు కేటాయించాలన్నారు. ముందుగా మంచిగా ఆలోచించకుండా హడావుడిగా బదిలీలు చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదివాసీ దినోత్సవంపై కార్యాచరణ



సమావేశానికి హాజరైన నాయకులు, పెద్దలు

గుమ్మలక్ష్మీపురం, జూలై20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న నిర్వహించేందుకు గుమ్మలక్ష్మీపురం వైటీసీ కేంద్రంలో ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, గిరిజన సంఘ నాయకులు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, జూలై20 ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సమస్యల పరిష్కారం కోసం ప్రతీవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా నిర్వహించనున్నామని ఐటీడీఏ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌కు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో పాటు పలు శాఖ అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

బోరుకు మరమ్మతులు

మక్కువ, జూలై20 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవాంగుల వీధిలో బోరు బావిని ఆదివారం స్థానిక టీడీపీ నాయకుడు దాసరి కేశవరావు మరమ్మతు చేయించారు. నెల రోజుల నుంచి తాగునీటికి స్థానికుల ఇబ్బంది నేపథ్యంలో ఆయన స్పందించారు.

